# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :255 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 20-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## బయటకు రావొద్దు.. బంగ్లా అల్లర్ల నేపథ్యంలో భారతీయులకు కీలక అడ్వైజరీ

న్యూఢిల్లీ, పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి కాల్పుల్లో గాయపడిన బంగ్లాదేశ్‌కు చెందిన సాంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ బిన్ హదీ మృతితో నిరసనకారులు విధ్వంసం సృష్టించారు. ఢాకా సహా పలు నగరాల్లో నిరసనకారులు వీధుల్లోకి వచ్చి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, మీడియా సంస్థలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయులు, భారత విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ సూచించింది. అనవసర ప్రయాణాలు చేయొద్దని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించింది. ఏదైనా సాయం కావాలంటే హైకమిషన్, అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

## సంక్షేమం పక్కనపెట్టి ఫుట్‌బాల్‌పై రూ.10 కోట్లు ఖర్చు..



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19: ఆదివాసులు, గిరిజనులపై సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## పంచాయతీ ఎన్నికలు.. కాంగ్రెస్‌లో కొత్త ట్విస్ట్!

వనపర్తి: వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఓడిపోయేందుకు పార్టీల్లోని కొందరు నేతలే కారణమని అన్నారు. పరోక్షంగా మాజీ మంత్రి చిన్నారెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. నియోజకవర్గంలో ఎక్కడెక్కడ పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమేంటో ఆ వివరాలన్నీ పీసీసీకి, ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తాను. వనపర్తిలో నేను ఒరిజినల్ కాంగ్రెస్ అంటూ కామెంట్స్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మెగారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'మూడు విడతలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో మేము ఈ రెండు సంవత్సరాలలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బాగా ఆదరించారు. వనపర్తి నియోజకవర్గంలోని 140 పంచాయతీల్లో 85 సీట్లు కాంగ్రెస్‌కు వచ్చాయి. 60.66% ఓటు శాతం వచ్చింది. బీఆర్ఎస్‌కు 51 గ్రామ పంచాయతీ సీట్లు రాగా ఓటు శాతం 36% వచ్చింది. అంటే బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్ పుంజుకుంది అనేది అందరూ గ్రహించాలి. గ్రామ పంచాయతీ వరకు చూస్తే కాంగ్రెస్‌కు 92407 ఓట్లు వచ్చాయి.. బీఆర్ఎస్‌కు 59788 ఓట్లు వచ్చాయి. రెండింటిని చూస్తే వారికన్నా కాంగ్రెస్‌కు 35.09% అధికంగా వచ్చాయి. ఎన్నికల ఓటు పర్సంటేజ్ విషయంలో బీఆర్ఎస్‌కు ఓటు శాతం తగ్గింది. వచ్చే ఎన్నికల్లో ఇంకా వాళ్ళు కిందికి పడిపోవడం ఖాయం. మా కాంగ్రెస్ పెద్ద మనిషి చిన్నారెడ్డి నియోజకవర్గంలోనే 15 గ్రామాలలో కావాలని పార్టీకి వెన్నుపోటు పొడిచి బీఆర్ఎస్ వాళ్లకు సపోర్ట్ చేశారు. బీఫామ్స్ విషయంలో



ఆయనకు కాకుండా నాకు వచ్చిందని కక్ష పెంచుకుంటే నామీద కోపం తీర్చుకోవాలి కానీ ఇలా పార్టీకి వెన్నుపోటు పొడిచి పార్టీ అభ్యర్థులను ఓడించడం సబబు కాదు. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్టానం వనపర్తి ప్రజలు అందరు గమనిస్తూనే ఉన్నారు. తగిన సమయంలో ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయం. చిన్నారెడ్డి పంచాయతీ ఎన్నికలలో ఓటర్లకు ఫోన్లు చేసి కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దు.. బీఆర్ఎస్‌కు ఓటు వేయమని చెప్పిన ఆధారాలు నా దగ్గర ఉన్నాయి. దీనిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం. ఆయనకు పార్టీ ఏం తక్కువ చేసిందని అభ్యర్థులను ఓడించారు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణలో మావోయిస్ట్ పార్టీకి బిగ్ షాక్!

హైదరాబాద్,మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ ఎదురు దెబ్బ తగిలింది. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగుబాటుకు సిద్ధమైనట్లు సమాచారం. వీళ్లలో పలువురు అగ్రనేతలు ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. పూర్తి వివరాలు తెలియడానికి మరికొన్ని గంటల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం 40 మంది మావోయిస్టులు తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోతున్నారని.. .. వీళ్లలో ముగ్గురు అగ్రనేతలు ఉన్నారని తెలుస్తోంది. ఈ మేరకు పూర్తి వివరాలను పోలీస్ బాస్ శివధర్‌రెడ్డి ఇవాళ మధ్యాహ్నం ప్రెస్‌మీట్ ద్వారా తెలియజేయనున్నారు. అయితే రాష్ట్రానికి సంబంధించిన వరకు మావోయిస్టు పార్టీ చరిత్రలో ఇదేం భారీ లొంగుబాటు కాదు!. కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో.. పార్టీకి మూలస్తంభాలుగా ఉన్న అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌లలో మరణించగా.. ఆ ప్రభావంతో ఇంకొందరు స్వచ్ఛందంగా తమ కేడర్‌లతో పెద్దఎత్తున లొంగిపోతున్నారు. పోలీసులు మాత్రం.. మావోయిస్టులకు ప్రజల మద్దతు తగ్గిపోవడం, పార్టీ నెట్‌వర్క్ నిర్వీర్యం కావడం, అనారోగ్యాల బారిన పడటం, ఎన్‌కౌంటర్ల భయం, సిద్ధాంతపరమైన విబేధాలు, తెలంగాణ ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలు.. కారణాలంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఇటు తెలంగాణలోనూ ఈ మధ్యకాలంలో పలువురు నేతలు ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. నవంబర్ నెలాఖరులో.. ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు సహా మొత్తం 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గతంలో.. 2021 సెప్టెంబరులో 52 మంది, ఈ ఏడాది మార్చి 15న 64 మంది, ఏప్రిల్ 5న 86 మంది, మే 9న 38 మంది లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు నగదు రివార్డుతోపాటు పునరావాస పథకం కింద ఇతర ప్రయోజనాలను అందిస్తోంది తెలంగాణ పోలీస్ శాఖ.

వీళ్లలో ఎవరైనా ఉండొచ్చా?..



తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి మావోయిస్టుల గురించి గత ప్రెస్‌మీట్‌లో.. తెలంగాణలో మిగిలింది 59 మంది మాత్రమేనని స్పష్టంగా ఒక ప్రకటన చేశారు. ఇందులో కేంద్ర కమిటీలో ఉన్న వాళ్లలో గణపతి, దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, పాక హన్మంతు, పసునూరి నరహరి తెలుగువారే. మరో 10 మంది తెలంగాణతోపాటు ఇతర ప్రాంతాల్లో రాష్ట్రకమిటీ హోదాలో ఉన్నారు. బడే చొక్కారావు తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శి కాగా.. గంకిడి సత్యనారాయణరెడ్డి, కంకణాల రాజిరెడ్డి, ముప్పిడి సాంబయ్య, గీరెడ్డి పవనానందరెడ్డి, జోడే రత్నాభాయ్ ఎలియాస్ సుజాత, లోకేటి చందర్, శేఖర్ ఎలియాస్ మంతు, మేకల మనోజ్, కర్రా వెంకట్‌రెడ్డి రాష్ట్ర కమిటీల సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ కమిటీలో ప్రస్తుతం రాష్ట్రానికి చెందినవారు నలుగురు ఉండగా.. మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే. అలాగే తెలంగాణకు చెందిన మావోయిస్టులు ఇతర రాష్ట్రాల కమిటీల్లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తాజా లొంగుబాటులో కీలక నేతలు ఉంటారా? ఉండరా? అనే ఆసక్తి నెలకొంది.

## కాల్పుల్లో గాయపడ్డ ఉస్మాన్ హదీ మృతి.. మళ్లీ బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు..!



ఢాకా,బంగ్లాదేశ్‌కు చెందిన సాంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హదీ సింగపూర్‌లో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. ఇటీవల తలకు బుల్లెట్ గాయంతో తీవ్రంగా గాయపడ్డ హదీ ఆరు రోజుల పాటు ప్రాణాలతో పోరాడారు. ఆయన మృతితో బంగ్లాదేశ్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హదీ మరణానికి సంతాపంగా తాత్కాలిక ప్రభుత్వం అధిపతి మహ్మద్ యూనస్ ఒకరోజు సంతాప దినంగా ప్రకటించడంతో పాటు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన మద్దతుదారులకు హామీ ఇచ్చారు. సమాచారం మేరకు ఢాకాలో గతవారం గుర్తు తెలియని వ్యక్తులు షరీఫ్ ఉస్మాన్ హదీపై కాల్పులు జరిపారు. దాంతో వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి.. అక్కడి నుంచి సింగపూర్‌కు తరలించారు. గురువారం రాత్రి పరిస్థితి విషమించి ఆయన తుదిశ్వాస విడిచారు. హదీ విద్యార్థి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. జులైలో జరిగిన ఉద్యమం షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆయన మరణాన్ని ఉద్యమంపై జరిగిన దాడిగా భావిస్తున్నారు. హదీ మరణంపై ప్రభుత్వ అధిపతి మహమ్మద్ యూనస్ మాట్లాడుతూ హదీ జులై ఉద్యమంలో ఒక నిర్భయ యోధుడని, ఆయన హత్య అత్యంత విచారకరమని అన్నారు. హంతకులను ఏ ధరకైనా వదిలిపెట్టబోమని హెచ్చరంచారు. హదీ భార్య, ఆయన బిడ్డ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. శాంతిని, సంయమనాన్ని పాటించాలని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హదీ మరణం తర్వాత రాజధాని ఢాకాలోని షాబాగ్ స్క్వేర్ వద్ద పెద్ద సంఖ్యలో విద్యార్థులు, జనం గుమిగూడి హదీకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాతే ఇస్లామీ పార్టీ సైతం హదీ మృతికి సంతాపం ప్రకటించారు. దాడి చేసిన వారిని అరెస్టు చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని, అవసరమైతే దేశాన్ని స్తంభింపజేస్తామని ఇంక్విలాబ్ మంచ్ హెచ్చరించింది. నిందితులు భారత్‌కు పారిపోతే.. భారత ప్రభుత్వంతో చర్చించి తిరిగి దేశానికి తీసుకురావాలని మంచ్ డిమాండ్ చేసింది. హదీ మరణం తర్వాత హింస, విధ్వంసం, భద్రతా సంక్షోభం మరింత తీవ్రమయ్యాయి. జాతీయ ఛాత్ర శక్తి అనే విద్యార్థి సంఘం ఢాకా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సంతాప యాత్ర నిర్వహించి, దాడి చేసిన వారిని పట్టుకోవడంలో విఫలమయ్యాడని ఆరోపిస్తూ హోం సలహాదారు జహంగీర్ ఆలం చౌదరి దిష్టిబొమ్మను దహనం చేసింది. మరో వైపు ఓ గుంపు రాజధానిలోని బెంగాలీ వార్తాపత్రిక ప్రొథోమ్ అలో కార్యాలయాలపై దాడి చేసింది. ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు నిప్పుపెట్టింది. పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఆపరేషన్ డెవిల్ హంట్-2 కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కఠినమైన భద్రతా చర్యలు విధించింది. శాంతిభద్రతలు క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రముఖ రాజకీయ ప్రముఖులకు ఆయుధ లైసెన్సులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సరళీకృత ప్రక్రియను కూడా ప్రకటించింది. హాది మరణం బంగ్లాదేశ్‌ను మరోసారి గందరగోళంలోకి నెట్టింది. షేక్ హసీనా ప్రభుత్వానికి ఉస్మాన్ హదీ కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. ఆగస్టు 5న అవామి లీగ్ ప్రభుత్వాన్ని కూలిపోవడానికి కారణమైన విద్యార్థుల హింసాత్మక నిరసనలకు నాయకత్వం వహించాడు. హది రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఆయన హత్యలో అవామీ లీగ్ పార్టీ హస్తం ఉండొచ్చని భావిస్తున్నారు.

## అలాంటి ఒప్పందమేదీ జరగలేదు..



బెంగళూర్ :: కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. 'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

## తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి.. 150 విమానాలు రద్దు

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచిక 380కి పడిపోయింది. తీవ్ర కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దృశ్యమానత పడిపోవడంతో ఇవాళ ఉదయం ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. వాటిలో 79 డిపార్చర్స్ కాగా, 73 అరైవల్స్ ఉన్నాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇలాంటి సూచనలే చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్సీఆర్, నోయిడా, ఘజియాబాద్‌లో దృశ్యమానత 100 మీటర్లుగా ఉంది. ఢిల్లీలోని 39 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో



ఏకంగా 14 కేంద్రాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. అత్యధికంగా ఆర్కే పురంలో గాలి నాణ్యత సూచిక 447గా నమోదైంది. ఆ తర్వాత ఆనంద్ విహార్, వివేక్ విహార్, సిరిఫోర్ట్ ప్రాంతాల్లో 442గా నమోదైంది. ద్వారకా సెక్టరా-8లో 429, నెహ్రూ నగర్‌లో 425, ఎన్ఎస్ఐటీ ద్వారకా ప్రాంతంలో 423, డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో 423, ఓఖ్లా ఫేజ్-2లో 422గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

## ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా.. చెక్ పెట్టిన పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 19: రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. సోహెల్‌తో



పాటు గంజాయి వినియోగించిన ఐదు మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జీ రామ్ జీ బిల్లు ఆమోదంపై.. రాత్రంతా ప్రతిపక్షాల నిరసన




న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని వీజీ-జీ రామ్ జీగా మార్పు చేసిన బిల్లును పార్లమెంటు ఆమోదించడంపై ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో ధర్నా చేశారు. 12 గంటలపాటు నిరసన కొనసాగించారు. వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) (వీజీ-జీ రామ్ జీ) బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్య గురువారం పార్లమెంటు ఆమోదించింది. రాజ్యసభలో అర్ధరాత్రి తర్వాత దీనికి ఆమోదం తెలిపారు. కాగా, ప్రస్తుత ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రతిపక్ష ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో 12 గంటల పాటు ధర్నా చేశారు. కొత్త బిల్లు రైతులు, గ్రామీణ పేదల వ్యతిరేకమని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడంపై దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు.

**సంపాదకీయం**

**శనివారం 20-12-2025**

## ఆ ఎమ్మెల్యేల జీతం మూడింతలు

దేశంలోకెల్లా అత్యంత అధికంగా జీతం తీసుకునే ఎమ్మెల్యేలు ఎవరో తెలుసా? ఒరిస్సా నాయకులే. ఈ మధ్యనే ఆ శాసనసభ సమావేశాల చివరి రోజున వారి జీతాలు ఏకదమ్మున మూడింతలు చేస్తూ బిల్లు ఆమోదించింది. దాంతోపాటే స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రుల జీతాలు కూడా పెంచేసింది. ఇప్పుడు వారికి నెలకు రూ.3 లక్షల 45 వేల జీతభత్యాలు వస్తాయి. ముఖ్యమంత్రికి అన్నీ కలిపి మరో యాభై వేలు అధికంగా ముడుతుంది. ఎమ్మెల్యే వేతనం రూ.35 వేల నుంచి రూ.90 వేలకు పెరిగితే భత్యాలు ఏకంగా రూ.65 వేల నుంచి రూ.2.55 లక్షలకు పెరుగుతాయి. ఇదే ఊపులో మాజీ ఎమ్మెల్యేల పెన్షన్లు కూడా భారీగా పెరుగుతున్నాయట. 2017 తర్వాత పెరుగుతున్న ఈ వేతనాల నిర్ణయం 2024 జూన్ నుంచి అమలులోకి వస్తుందట. అంటే వెనకటి కాలానికీ వర్తిస్తుందన్నమాట. ఒరిస్సాను వరుసగా పాలించిన బిజెడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలన స్థానంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేశాక జరుగుతున్న మార్పు ఇది. అయితే ఇవేవీ బిల్లు ఏకగ్రీవ ఆమోదానికి ఆటంకం కాలేదు. కాకపోతే క.తు (కంటి తుడుపు) ప్రక్రియ కోసం నవీన్ పట్నాయక్ తను పెంచిన జీతం తీసుకోబోనని, ఆ మొత్తం పేదల కోసం ఖర్చు చేయాలని కోరారు. లోపల అన్నిటికీ ముద్రేసేసి బయటికొచ్చి భంగిమలేమిటని శాసనసభ లాబీల్లో గుసగుసలూ వినిపించకపోలేదు మరి. జీతాలు ఇంత పెంచుకున్నారు సరే! జవాబుదారీతనం, బాధ్యతలు ఏమైనా పెంచుకున్నారా అని కొందరు సవాలు చేశారు కూడా. ఇవన్నీ చూస్తుంటే ఒకప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంటులో చేసిన ప్రసంగం గుర్తుకు రాకమానదు. ఎంపీల జీతాల పెంపును వ్యతిరేకిస్తూ ముందు కార్మికుల కనీస వేతనం పెంచే చర్చ చేయాలని ఆయన వాదించారు.

### నెహ్రూ లేఖలపై లేనిపోని గగ్గోలు

ఈ మధ్య వందేమాతరం చర్చ నెహ్రూపై ఆరోపణల సమయంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఒక ఆఫర్ చేశారు. నిరతరంఏదో విధంగా నెహ్రూపై నిందారోపణలు వెతికేబదులు ఒకరోజు ప్రత్యేక చర్చ పెడదాం. ఎంతసేపు చెబుతావో ఎన్ని ఆరోపణలు చేస్తారో చేసుకోండి అని ఆమె నవ్వుతూ అన్నారు. సభాపతి ఓం బిర్లా సర్కారును కాపాడ్డం కోసం విషయంపై మాట్లాడమని ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రధాన మంత్రుల మ్యూజియం, గ్రంథాలయం (పి.ఎం.ఎం.ఎల్)లో నెహ్రూ లేఖలు మాయమైనాయనే ఆరోపణ కూడా ఈ పరంపరలో భాగమేనా? తీన్‌మూర్తి భవన్‌లో నెహ్రూ మ్యూజియంను ఈ పేరుతో మార్పు చేశారన్నది తెలిసిన విషయమే. ఈ కేంద్రం నిర్వాహకులలో ఒకరైన రివాజ్ ఖద్రీ చేసిన ఆరోపణ ఇందుకు కారణమైంది. నెహ్రూ వ్యక్తిగత లేఖలను సోనియా గాంధీ తీసుకుపోయారనేది ఆయన ఆరోపణ. నెహ్రూ–ఎడ్వినా మౌంట్‌బాటెన్ మధ్య నడిచిన లేఖలు సోనియా ఆదేశాలపై 2008లో మాయం చేశారని ఖద్రీ ఆరోపించారు. వీరిద్దరి మధ్య ఏదో వ్యవహారం నడిచిందనే కథలు చాలా కాలంగా ప్రచారంలో వున్నాయి. నెహ్రూ వంటి వారిపై చవకబారు పోస్టులు పెట్టి ఇప్పటికీ సంఘ్‌పరివార్ సంతోషిస్తుంటుంది. కనుక బిజెపి ఈ అంశంపై ఫోకస్ పెట్టడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే వారి ఈ ప్రచారం కేవలం కల్పితమని ప్రభుత్వమే ఖండించాల్సి వచ్చింది. మ్యూజియంలో నెహ్రూకు సంబంధించిన పత్రాలేమీ తప్పిపోలేదని సాంస్కృతిక శాఖామంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తమ పార్టీ సభ్యుడే అయిన సంబిత్ పాత్రకు సమాధానమిచ్చారు. అసలు ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదని కూడా బల్ల గుద్ది మరీ చెప్పారు. దీనిపై క్షమాపణ చెబుతారా అని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ట్వీట్ చేశారు. ఎందుకు చెబుతారు?

### ఆ చిత్రాలు చూపిస్తామన్న కేరళ

భావ ప్రకటనా స్వేచ్ఛకూ మోడీ సర్కారుకు బొత్తిగా పొసగదు కదా. 30వ కేరళ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి (ఐ.ఎఫ్.ఎఫ్.కె) ఎంపిక చేసిన 19 చిత్రాలకు కేంద్రం కాలడ్డం పెట్టింది. వాటిని ప్రదర్శించడానికి లేదని సెన్సార్ బోర్డు తాఖీదు పంపింది. అయితే కేరళ ప్రగతిశీల సంస్కృతీ సంప్రదాయాలు ఈ కేంద్ర ప్రభుత్వానికి బోధపడవని రాష్ట్ర సాంస్కృతిక మంత్రి షాజీ చెరియన్ ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ 19 చిత్రాలు అంతర్జాతీయంగా మన్నన పొందినవే. విమర్శకులూ మెచ్చుకున్నవే, చిత్రోత్సవ ప్రతినిధులు వాటిని చూసేందుకున్న హక్కును మనమెలా నిరాకరించగలం? అని ఆయన ప్రశ్నించారు. చిత్రోత్సవ ప్రధాన వేదిక అయిన టాగూర్ ఆడిటోరియం దగ్గర డివైఎఫ్ఐ నిరసన ప్రదర్శన కూడా జరిపింది. ఈలోగా ఓ అడుగు వెనక్కు వేసిన కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ వాటిలో అయిదు చిత్రాలకు అనుమతినిస్తున్నట్టు తెలియజేసింది. బీఫ్, ఈగల్స్ ఆఫ్ రిపబ్లిక్, హార్ట్ ఆఫ్ ద వోల్ఫ్, వన్స్ అపాన్ ఎ టైమ్‌ప్రదర్శించుకోవచ్చని తెలిపింది. అయితే మిగిలిన 14 సినిమాలు కూడా అనుకున్నట్టే వేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలస్తీనా 36, ఆల్ దటీజ్ లెఫ్ట్ ఆఫ్ యూవంటివి వాటిలో వున్నాయి. సోవియట్ దర్శకుడు ఐజెన్‌స్టీన్ క్లాసిక్ ‘బ్యాటిల్ షిప్ పోటెమ్‌కిన్’ కూడా వాటిలో వుంది. పోలీసు క్రౌర్యాన్ని చూపే ‘సంతోష్’ ప్రదర్శన వుండబోతోంది. గురువారం మొదలయ్యే ఈ ఉత్సవంలో మౌరిటానియాకు చెందిన ప్రఖ్యాత దర్శకుడు అబద్‌రహమానే సిసాకోకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తారు. ఆయన చిత్రాలు ‘టింబక్టు, బ్లాక్ టీ’ కూడా ప్రదర్శించబోతున్నారు.

# మళ్లీ కాటేసిన ఉగ్రవాదం

సెంట్రల్ డెస్క్:ప్రశాంతంగా ఉన్నంతకాలమూ అంతా సవ్యంగా ఉందనుకోవటమే తప్ప ఉగ్రవాదం తీవ్రత ఎక్కడా తగ్గలేదని గత ఆదివారం ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండీ బీచ్‌లో చోటు చేసుకున్న ఉదంతం తెలియజేస్తోంది. హన్నూక సంబరాల్లో మునిగిన యూదు సమూహంపై తండ్రీకొడుకులిద్దరు తుపాకులతో దాడి చేసి 15 మందిని కాల్చిచంపటం, 40 మందిని గాయపర్చటం గమనిస్తే నిరంతర అప్రమత్తత ఎంత అవసరమో అర్థమవుతుంది. ప్రతిచోటా భద్రత కల్పించటం ప్రభుత్వాలకు సాధ్యం కాకపోవచ్చు. అందుకే వర్తమాన పరిస్థితుల్లో ఎవరికి వారు తమ చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో అనునిత్యం గమనించుకోవడం తప్పనిసరి. తుపాకీ చట్టాలు ఎంతో కఠినంగా ఉండే ఆస్ట్రేలియాలో ఈ మాదిరి ఘటన జరిగి మూడు దశాబ్దాలవుతోంది. 1996లో పోర్ట్ ఆర్తర్‌లో ఒక దుండగుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. గత రెండేళ్లలో యూదులకు వ్యతిరేకంగా దాదాపు 2,000 ఘటనలు జరిగినట్టు పోలీసు నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుత ఉదంతం కూడా దానికి కొనసాగింపే! ఇలాంటి నేపథ్యంలో నిఘా మరింత పక ద్బందీగా ఉంటే బాగుండేది. ఉ న్మాదులు హఠాత్తుగా ఎక్కడైనా దాడులకు తెగబడొచ్చని ఇది రుజువుచేస్తోంది. ఆస్ట్రేలియా భిన్న జాతుల నిలయం. చాలా దేశాలతో పోలిస్తే అది స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు పెట్టింది పేరు. దేశ జనాభాలో యూదుల శాతం 0.4 శాతం. అంకెల్లో చెప్పు కోవాలంటే అది 1,17,000. అందులో చాలా కుటుంబాలు నాజీ జర్మనీలో హిట్లర్ ఉన్మాదాన్ని అధిగమించి అదృష్టవశాత్తూ బతికి బయటపడినవారివే. ఇజ్రాయెల్ పాల కులు గాజాపై రెండేళ్లపాటు ఎడతెగకుండా సాగించిన హంతకదాడుల్లో వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ ఆ దాడులు ఆగింది లేదు. దాన్ని ప్రపంచ దేశాల ప్రజలంతా నిరసించారు. అందులో యూదులు కూడా ఉన్నారు. ఆస్ట్రేలియా సైతం తీవ్రంగా ఖండించింది. అంతేకాదు, మొన్న ఆగస్టులో పాలస్తీనాను గుర్తించింది. ఆస్ట్రేలియాలో ఉంటున్న యూదులంతా ఇజ్రాయెల్ దుండగాన్ని సమర్థించారని కూడా చెప్పలేం. ఉగ్రవాద సంస్థ హమాస్ సాగించిన హత్యాకాండకు ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకోవటం సబబేనని భావించేవారు ఉంటే ఉండొచ్చు. అలాంటి వారిని సైతం ఒప్పించేలా, మార్పు గలిగేలా ఉద్యమాలు నిర్మించాలి తప్ప సంబంధం లేని అమాయక పౌరుల్ని చంపి ఇలాంటి ఉన్మాదులు ఏం సాధిస్తారు? ఇప్పుడు దాడికి పాల్పడిన తండ్రీకొడుకులకు గాజా ఉదంతం సాకు మాత్రమే. హైదరాబాద్ పాతబస్తీ నుంచి 27 ఏళ్ల క్రితం సాజిద్ అక్రం వలసపోగా,



ఆరేళ్లక్రితమే అతని కుమారుడు నవీద్ ఫిలిప్పీన్స్‌లోని ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలు పెట్టుకున్నాడని, అప్పటినుంచి వారిద్దరికీ ఉన్మాదం తలకెక్కిందని అంటు న్నారు. గత నెలలో వారిద్దరూ ఫిలిప్పీన్స్ వెళ్లి సైనిక శిక్షణ తీసుకున్నారని పోలీసుల కథనం. ఆర్నెల్లక్రితం కొడుకుపై అనుమానం వచ్చి నిఘా సంస్థ అధికారులు ప్రశ్నించా రట కూడా! కొడుకు పేరుతో రిజిస్టరైన వాహనంలో పేలుడు పదార్థాలు, ఐఎస్ పతా కాలు ఉన్నట్టు పోలీసు సోదాలో బయటపడింది. ఉదంతం జరిగిన రోజే తండ్రిని పోలీసు బలగం కాల్చిచంపగా, కొడుకు సాజిద్‌ను సమీపంలోనే ఉన్న చిరువ్యాపారి అహ్మద్ అల్ %-%అహ్మద్ చాకచక్యంగా పట్టుకోగలిగాడు. మృత్యువుకు ఎదురొడ్డి అతను చేసిన సాహస కార్యం వల్ల అనేకమంది ప్రాణాలు నిలబడ్డాయి. కానీ అహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు.ఈ ఉదంతంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ విచిత్రంగా స్పందించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ విధానాలు యూదు వ్యతిరేకతను ప్రోత్సహించే■విగా ఉన్నందువల్లే ఈ ఉదంతం జరిగిందని వ్యాఖ్యానించారు. పాలస్తీనా రాజ్యం ఏర్ప డాలని కాంక్షించటం యూదు వ్యతిరేక చర్య ఎలా అవుతుందో నెతన్యాహూకే తెలియాలి. హమాస్ ఉగ్రవాదులు 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి 1,195 మంది ఆ దేశ పౌరుల్ని, విదేశీయులు కొందరిని చంపేశారు. 251మందిని బందీలుగా తీసుకెళ్లారు. ఆ విషయంలో ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చటానికి నెతన్యాహూ గాజాపై విరుచుకుపడ్డారు. ఇప్పుడాయన ఆల్బనీస్‌ను తప్పుపట్టేందుకు సిద్ధపడ్డారు! ఏదేమైనా ఆస్ట్రేలియా ఉదంత■ ప్రపంచ దేశాల కళ్లు తెరిపించాలి. అత్యంత అప్రమత్తంగా ఉండకపోతే ఉగ్రవాద భూతం ఎక్కడైనా విరుచుకుపడొచ్చని తెలుసుకోవాలి.

# వలసదారులకు మానవ హక్కులు వర్తించవా?



న్యూఢిల్లీ,మానవ వలసలు ఒక ప్రమాదకర అంతర్జాతీయ సమస్యగా రోజు రోజుకు ప్రపంచ మానవాళిని వేధిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 2014 నుంచి నేటి వరకు కనీసం 70,000 మంది వలసదారులు తమ ప్రాణాలను కోల్పోయారని లేదా ఆచూకీ తెలియకుండా పోయిందని, వాస్తవానికి ఈ సంఖ్య అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్కొక్క వలసదారుల మరణాలు ఒక్కో కుటుంబానికి తీరని వ్యథను మిగిల్చిందని గమనించాలి. నేడు ప్రపంచవ్యాప్తంగా పలు కారణాలతో మానవ వలసలు క్రమంగా పెరగడం రానున్న కాలంలో ఒక భయానక మానవీయ సంక్షోభంగా మారనుందని స్పష్టం చేస్తున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులు, నిరంకుశ పాలనలు, ఆహార అభద్రత, మానవీయ సంక్షోభాలు, ఆర్థిక అసమానతలు లాంటి పలు కారణాలు వలసదారుల సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయి. 2023లో ప్రపంచవ్యాప్తంగా వలసదారుల వేదనలు పెరగడం, వలసల వరదలు పారడం, వలసదారుల కన్నీటి తుపానులు ప్రవహించడం చూశాం.ఇజ్రాయెల్ – పాలస్తీనా, ఉక్రెయిన్ – రష్యా యుద్ధాలు, బంగ్లాదేశ్‌లో అంతర్గత రాజకీయ సంక్షోభం, ప్రకృతి విపత్తులు, ఆకలి కేకలు వంటి కారణాలతో మానవ వలసల వరదలు పారడం, ఇరుగు పొరుగు దేశాల్లోకి లేదా సురక్షిత ప్రాంతాల్లోకి శరణార్థులుగా చేరడం, యుద్ధాలు లేదా అల్లరులతో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఇండ్లు వదిలి వలసదారులు పట్టడం చూశాం. వలసదారుల శ్రమ శక్తి, నైపుణ్య లక్షణాలు, ఆవిష్కరణ ఆలోచనలు, ఔత్సాహిక ప్రవృత్తులు నేటి సమాజానికి ఎంతో ఉ పకరిస్తాయని మరువరాదు. వలసదారులతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి కనిపిస్తుందని, వారికి అవకాశాలు కల్పిస్తే సమాజాభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడతారని తెలుసుకోవాలి. మిలియన్ల కొద్దీ వలసదారుల తమ గృహాలను వదిలి ప్రాణాలు కాపాడుకోవడానికి పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఇతర దేశాలు లేదా ప్రాంతాలకు పరుగులు తీయడాన్ని ఒక అమానవీయ చర్యగా భావించిన ఐరాస సభ్యదేశాలు 2000 నుంచి ప్రతి ఏటా 18 డిసెంబర్ రోజుల అంతర్జాతీయ వలసదారుల దినం లేదా ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే నిర్వహించడం ఆనవాయితీగా మారింది.వలసదారులపట్ల మానవ హక్కుల ఉల్లంఘనలకు సమాధానాలు, వారి దయనీయ పేదరికాలు, సమ్మిళిత అభివృద్ధి ఆశయాలు, వలసదారుల పరిరక్షణ పాలసీలు, వారి భద్రత, వారి శాంతి సురక్షలు, మానవీయ హక్కుల కల్పనలు, ఆకలి చావులను అడ్డుకోవడం, గౌరవంగా జీవించే హక్కులను కల్పించడం, స్వేచ్ఛను కలిపించడం, వివక్ష కోరల్లో చిక్కడం, హింసలపాలు కావడం, మానవ అక్రమ రవాణా వలలో చిక్కడం, వారి అభిప్రాయాలు, కన్నీళ్లకు విలువ లేకపోవడం లాంటివి పలు అంశాలను చర్చించి సరైన సమాధానాలు వెతకడానికి ఈ వేదికలు ఉ పకరిస్తున్నాయి. అంతర్జాతీయ వలసదారుల దినం– 2025 ఇతివృత్తంగా నా విజయ గాథ: సంస్కృతి, అభివృద్ధి (మై గ్రంట్ స్టోరీ: కల్చర్స్ అండ్ డెవలప్‌మెంట్) అనబడే అంశాన్ని ప్రచారం చేయడం జరుగుతోంది. వలసదారుల శ్రమదోపిడీ ఒక ప్రధాన సమస్యగా మారడం విచారకరం.తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ రంగం, వ్యవసాయ రంగాలు, వ్యాపారాలు, నైపుణ్య రంగాల్లో బీహార్, యుపి, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ప్రజలు వలసలు రావడం చూస్తున్నాం. నిస్సహాయ పరిస్థితుల్లో కుటుంబాలు లేదా వ్యక్తులు పలు కారణాలతో తమ గృహాలను వదిలి ఇతర దేశాలకు లేదా ప్రాంతాలకు వెళ్లడాన్ని మానవ వలసలుగా పిలుస్తారు. భారత్ లాంటి దేశాల్లో పని, ఆహార భద్రత, పేదరికం లాంటి కారణాలతో పట్టణాలు లేదా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం. బలవంతంగా అయినా లేదా మరో దారిలేనపుడు వలసలు పెరుగుతున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, పర్యావరణ కారణాలతో భారతదేశంలో వలసలు కనిపిస్తున్నాయి.2011 వివరాల ప్రకారం భారత దేశవ్యాప్తంగా 45.6 కోట్ల మంది ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వీరిలో 54 శాతం మంది పట్టణాలకు వలసలు వెళ్లినట్లు తెలుస్తున్నది.యుపి, బీహార్ లాంటి రాష్ట్రాల నుంచి దాదాపు 88% ఇతర రాష్ట్రాలకు వలసల వరదలు పారడం చూస్తున్నాం. వలసదారుల సమస్య ఫలితంగా పౌరసమాజంపై సానుకూల, ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, జనాభా పరమైన, సామాజిక, పర్యావరణ కోణాల్లో పలు సమస్యలు లేదా అనుకూల ఫలితాలు గమనించవచ్చు. మానవ హక్కులను కోల్పోవడం, సామాజిక అభద్రత, కనీస అవసరాల కొరత, గౌరవమైనా పని దొరక్కపోవడం, వైద్య ఆరోగ్య అభద్రత, కనీస వేతనాలు దొరక్కపోవడం, మురికివాడల్లో జీవనాలు లాంటి పలు సమస్యలు వలసదారులు వేధిస్తున్నాయి. వలసదారులు మన లాంటి సాధారణ మానవులే అని, వారికి కూడా గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని తెలుసుకొని వారిని మన సమాజంలో భాగంగా చూసుకుందాం, మానవీయ విలువలను కాపాడుదాం.

# ఈ క్రెడిట్ అంతా సహచరులు..అధికారులదే



అమరావతి, ప్రతిష్టాత్మకమైన ’బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్’ అవార్డుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును ప్రముఖ దినపత్రిక ఎకనామిక్ టైమ్స్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ అవార్డుపై కలెక్టర్ల సదస్సులో సీఎం స్పందించారు. ఈ తరహా అవార్డులు ఎప్పుడూ తాను తీసుకోలేదని.. విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్ ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పారు. ఈ అవార్డు రావటం వెనుక క్రెడిట్ అంతా తన సహచరులు, అధికారులు, కలెక్టర్లదే అని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో గతంలో గుజరాత్ మొదటిస్థానంలో నిలిచిందని... ఆ తర్వాత ప్రతీ ఏడాది ఏపీనే అగ్రస్థానంలో నిలిచిందని సీఎం చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు నిబంధనలు మార్చినా ఏపీనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని సీఎం తెలిపారు. 18 నెలల్లో 25 పాలసీలను తీసుకువచ్చి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకువస్తున్నామన్నారు. ప్రతీ నెలా ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలియ చేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తున్నారని.. ఇక కేంద్రం ఇస్తున్న సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించగలుగుతారా అని చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారని.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని చెప్పాం.. చేసి చూపిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు, పరిశ్రమలు ఏపీని విశ్వసిస్తున్నాయన్నారు. దేశంలోని ఏ రాష్ట్రం తీసుకురాని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను తీసుకువచ్చామని.. దీనికి త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించారు. లేబర్ కోడ్ గైడ్ లైన్స్ విషయంలోనూ కేంద్రం ఏపీని సంప్రదించిందన్నారు. అందుకే ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌ను అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌కు ధారాదత్తం

అమరావతి,మాజీ సీఎం వైఎస్ జగన్ విజన్‌తో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారని, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ఉండాలన్నది సంకల్పించారని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు వస్తే ఆరోగ్యశ్రీ ఖర్చులు తగ్గుతాయని జగన్ భావించారన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రైవేట్ పరం అయితే ప్రభుత్వం ఉండి ఏం లాభం అని.. ఇది పీపీపీ కాదు, పెద్ద స్కామ్ అన్ని ÷ర్ అయ్యారు. ఏదైనా ప్రైవేటుకు వెళ్తే ప్రజలకి నష్టమే అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.’వైఎస్ జగన్ చాలా కృషి చేసి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా ప్రైవేట్ పరం చేస్తానంటుంది. ప్రైవేటుపరం అయిపోతే పేదల పరిస్థితి ఏంటి?. విద్య, వైద్యం పూర్తిగా ప్రవేటు అయిపోతే ప్రభుత్వం ఉండి ఏం లాభం?. ప్రైవేట్ అత్యుత్తమం అని చంద్రబాబు చెప్పడం దారుణం. ప్రైవేట్ వాళ్ళు ఎందుకు సర్వీస్ చేస్తారు?. సొంతగా సర్వీస్ చేస్తే పర్లేదు ప్రభుత్వ ఆస్తులు కట్టబెట్టాక ఏంటి?. ఇది పీపీపీ కాదు పెద్ద స్కాం. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. విభజన తర్వాత ఇంత స్పందన రావడం ఇదే మొదటిసారి. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగ 1.4 కోట్ల సంతకాలు వచ్చాయి. ప్రజల స్పందనకి చంద్రబాబు కొంచం తగ్గారు. ప్రభుత్వ అనే పేరు ఉంటుంది అంటున్నాడు. పేరు ఒక్కటే ఉంటే ఏమి ఉపయోగం.. అన్ని ఇచ్చి ప్రైవేటుకి ఇవ్వడం ఏంటి?. రాష్ట్రంలో చాలా మెడికల్ కాలేజీలు హాస్పిటల్స్ ప్రభుత్వం నడపడం లేదా?. రెండేళ్లు జీతాలు ఇస్తాం అంటున్నారు.. వాటికి అయ్యే ఖర్చుతో కాలేజీలు పూర్తి చెయ్యండి. ఏ విద్యార్థి అయినా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదవాలని కోరుకుంటారు. అవసరం లేకపోయినా చంద్రబాబు ప్రైవేటీకరణను నెత్తిన పెట్టుకున్నాడు’ అని సజ్జల మండిపడ్డారు. ’సీఎం చంద్రబాబు సిద్ధాంతమే ప్రవేటీకరణ. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే. చంద్రబాబు ఇక్కడితో ఆగడు పీహెచ్సీలు కూడా ప్రయివేటుకు ఇస్తాను అంటాడు. చంద్రబాబు రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాడు. కోటి నాలుగు లక్షల 11 వేల సంతకాలు వచ్చాయి. బ్యాలెట్ బాక్స్ లో ఓటు వేసినట్టే ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజల నిర్ణయాన్ని చంద్రబాబు గౌరవించాలి.. కావాలి అంటే క్రెడిట్ నువ్వే తీసుకో. చంద్రబాబుకి క్రెడిట్ చోరీ చెయ్యడం అలవాటే కదా. చంద్రబాబు ఈ వయసులో ప్రజల ఉసురు పోసుకోవద్దు.. నిర్ణయం మార్చుకో. మిగిలిన రంగాల్లో ప్రైవేటీకరణ వేరు.. మెడికల్ కాలేజీలు వేరు. ఏదైనా ప్రైవేటుకు వెళ్తే ప్రజలకి నష్టమే. రోడ్లు పీపీపీలో జరుగుతున్నాయి, అందుకే టోల్ టాక్స్ భారీగా వసూల్ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తుంటే చార్జీల కంటే టోల్ టాక్స్ ఎక్కువ అవుతుంది. ప్రజలు సంతకాలు చేశారో లేదో ప్రజల్లోకి వెళ్లి తెలుసుకోండి. ప్రజల్లోకి వెళ్లే ధైర్యం మంత్రులకి ఉ ందా?’ అని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.

# వాజ్‌పేయ్‌ను రాష్ట్రపతి చేయాలనుకున్న బిజెపి

న్యూఢిల్లీ, రాష్ట్రపతిగా వాజ్‌పేయి, ప్రధానిగా అద్వానీని చేయాలనుకున్నారా..బిజెపి చేసిన ఈ ప్రయత్నం విఫలం అయ్యిందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాజ్‌పేయి మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం ’అటల్ సంస్మరణ్’లో ఇప్పుడీ విషయాలు చర్చకు వస్తున్నాయి. అయితే వాజ్‌పేయ్ తిరస్కరణతో ఈ వ్యవహారం బయటరకు ర ఆకుండా పోయిందని తెలుస్తోంది. భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఏపీజే అబ్దుల్ కలామ్ పేరును ఎన్నుకోవడానికి ముందు ఆ పదవికి భాజపా అటల్ బిహారీ వాజ్‌పేయి పేరును ప్రతిపాదించిందట. ఆ సమయంలో వాజ్‌పేయి మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టండన్ రాసిన పుస్తకం ’అటల్ సంస్మరణ్’ లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాజ్‌పేయి పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించి, ప్రధాని స్థానంలో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.అద్వాణీని■ఎన్నుకోవాలని భాజపా సూచనలు చేసినట్లు అశోక్ టండన్ పేర్కొన్నారు. అయితే పార్టీ చేసిన ఈ ప్రతిపాదనను అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నిరాకరించినట్లు తెలిపారు. ప్రధానిగా ఉన్న తాను రాష్ట్రపతి పదవికి మారడం సరైన చర్య కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. తాను ఎంతటి ప్రజాదరణ పొందిన నాయకుడిని అయినప్పటికీ.. మెజారిటీ ఆధారంగా రాష్ట్రపతి పదవిని పొందలేనని వాజ్‌పేయి పేర్కొన్నట్లు అశోక్ టండన్ తెలిపారు. రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదిరేలా చర్చలు జరపడా■కి ప్రధాన ప్రతిక్షమైన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్‌లను ఆయన ఆహ్వానించారన్నారు. అనంతరం రాష్ట్రపతి స్థానానికి ఎన్డీఏ తరపున ఏపీజే అబ్దుల్ కలామ్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా మద్దతు తెలపడంతో 2002లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం, ప్రతిపక్షాల మద్దతుతో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలిపారు.వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోని అనేక ఘటనలను అశోక్ టండన్ తన పుస్తకం■ వివరించారు. అటల్–అద్వానీలకు విధానపరమైన అంశాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. భారత రాజకీయాల్లో వారి భాగస్వామ్యం, సహకారం సమతుల్యతకు చిహ్నంగా ఉండేదన్నారు. వారి దిశానిర్దేశరలో భాజపా మరింత అభివృద్ధి చెందినట్లు రాసుకొచ్చారు. మొత్తంగా అద్వానీకి అదృష్టం కలసి రాలేదు. వాజ్‌పేయ్ తరవాత పదేళ్లు యూపిఏ పాలన సాగింది. ఆ సమయంలోరెండుసార్లు ఎన్నికల్లో బిజెపి ప్రతిపక్షానికే పరిమితం అయ్యింది. ఆ తరవాత మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించడంతో ఇక అద్వానీకి అవకాశం లేకుండా పోయింది.

# వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు

విజయవాడ,వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై గురువారం కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సత్యవర్ధన్‌ను వంశీ అండ్ కో కిడ్నాప్ చేసి దాడి చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. 2023లో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. అయితే ఈ దాడిలో ప్రధాన సాక్షిగా సత్యవర్ధన్ ఉన్నారు. ఈ ఘటనలో ఆయన ఇచ్చిన ఫిర్యాదే కీలకంగా మారింది. ఈ క్రమంలో సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. 2024 జులైలో తనపై వంశీ అండ్ కో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో సత్యవర్ధన్ తెలిపారు. దీంతో వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

## నదీ జలాలలపై బిఆర్ఎస్ ద్రోహం

హైదరాబాద్, నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సిఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం అని రేవంత్ అన్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నిక పోరు ముగిసింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా చాటింది. పెద్ద సంఖ్యలో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముందుకు వచ్చారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపైనా కీలక కామెంట్స్ చేశారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ గెలవలేదని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీష్ రావు వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టిందని.. అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారని అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం మరోమారు స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.

## వార్డు మెంబర్‌గా గెలిచిన ట్రాన్స్ జెండర్

నాగర్‌కర్నూల్,(ట్రాన్స్ జెండర్ అంటే.. గృహప్రవేశాలు, శుభకార్యాలలో, రోడ్లపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేస్తారని అంతా భావిస్తారు. కానీ, తాము ప్రజా సేవలోనూ ముందుంటామని ఈ ట్రాన్స్‌జెండర్ నిరూపిస్తున్నారు. పంచాయితీ ఎన్నికల్లో నిలవడమే కాకుండా.. జయకేతనం ఎగురవేశారు.నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా చారకొండ గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 11వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్ జెండర్ నందిని ఎన్నికయ్యారు. ఈ పంచాయతీలో 12 వార్డులకు గాను 11వ వార్డుకు ఎస్సీ జర్నరల్ కేటాయించారు. ఈ వార్డు నుంచి కాంగ్రెస్ మద్దతుతో నందిని, బీఆర్ఎస్ నుంచి పెద్దాపూర్ వెంకటయ్య, బీఎస్పీ నుంచి మల్లేష్ పోటీ పడ్డారు. ఈ వార్డులో మొత్తం 372 ఓటర్లు ఉన్నారు. బుధవారం వెల్లడైన ఫలితాలలో నందిని.. బీఆర్ఎస్ అభ్యర్థిపై 64 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆమె గెలుపుపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నందిని.. ట్రాన్స్‌జెండర్ మహిళలు ఓన్లీ నూతన గృహప్రవేశాలప్పుడు, శుభకార్యాలలో డబ్బులు వసూలు చేస్తారనే భావన ప్రజల్లో ఉంటుంది. కానీ, డబ్బులు వసూళ్లకే పరిమితం కాకుండా అన్నిట్లో మేమున్నామని చాటిచెప్పాలనే తన లక్ష్యమన్నారు. తనను ఆదర్శంగా తీసుకొని ట్రాన్స్‌జెండర్ మహిళలు అన్నింట్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి అవకాశం కల్పించిందని.. తనను గెలిపించిన గ్రామ ప్రజలకు నందిని కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ.. గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడతానన్నారు.

## పాకిస్తాన్, చైనా గేమ్‌ప్లాన్!

అరుణాచల్ ప్రదేశ్: అరుణాచల్ ప్రదేశ్ ఈశాన్య భారతంలో చివరిన ఉండే రాష్ట్రం. పక్కనే చైనా సరిహద్దు. ఇప్పటికే చైనా అరుణాచల్ ప్రదేశ్ మాదే అంటుంది. మ్యాపులు విడుదల చేస్తూ కవ్విస్తోంది. అయితే ఇక్కడ ఇంత వరకు ఎలాంటి ఉగ్ర కార్యకలాపాలు లేవు. కానీ తాజాగా రాజధాని ఈటానగర్ సమీప చింపు గ్రామంలో ఒక యువకుడు అసాధారణ చూపులు గుర్తించాడు. శీతాకాలంలో రంగురంగుల వస్త్రాలు విక్రయించుకునే వ్యక్తి ప్రాంతాలు, మార్గాలను ఫోటోలు, వీడియోల ద్వారా రికార్డ్ చేస్తున్నాడు. రెండోసారి మిలిటరీ స్థాపనల వద్ద ఇలాంటి కదలికలు చూసి, రాజకీయ నాయకుడి, తర్వాత పోలీసుల వద్ద సమాచారం అందించాడు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి.

చిరు వ్యాపారుల ముసుగులో..

యువకుడు ఇచ్చిన సమాచారంతో చిరు వ్యాపారిని నవంబర్ 22న పోలీసులు వ్యాపారిని పట్టుకుని తప్పుడు గుర్తింపులు (బిహార్, ఢిల్లీ) గుర్తించినా, జక్కువాడా (జమ్మూ కశ్మీర్) నివాసి నజీర్ అహ్మద్ మాలిక్‌గా బయటపడ్డాడు. ఇన్నర్ లైన్ పర్మిట్ సరైనదైనా, సోషల్ మీడియాలో అల్-అక్సా గ్రూప్, సైనిక రికార్డులు బయటపడ్డాయి. 3000 కి.మీ. ప్రయాణం, డేటా డిలీట్ ప్రయత్నాలు అనుమానాలు పెంచాయి. విశ్లేషణ: డిజిటల్ ఫుట్‌ప్రింట్‌లు ఆధునిక రహస్య కార్యకలాపాల మాయను ధ్వంసం చేస్తాయి, పోలీసు విచారణ దృష్టికి దారి తీసింది.

మరో ఇద్దరు కూడా..

నజీర్ అహ్మద్ మాలిక్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సామిర్ అహ్మద్ బిన్, మాళేలో గిలాల్ అహ్మద్ (26 ఏళ్లు, కూడా కుప్వాడా) అరెస్టయ్యారు. ముందస్తు టెలిగ్రామ్ గ్రూపులు, ఐఎస్ఐ ఆదేశాలతో సైనిక స్థాపనలపై దృష్టి, బాంబు తయారీ, మైన్ ఇన్‌స్టాలేషన్ శిక్షణలు వెల్లడయ్యాయి. పాలస్తీనా మసీదు పేరుతో నడిచే ఉగ్ర గ్రూపులో సభ్యులుగా ఉన్నారు. భారత లోతట్టు ప్రాంతాల్లో చొరబడటం, బహిరంగ రూపాలు ధరించడం ఇంటెలిజెన్స్ గ్యాప్‌లను సూచిస్తుంది.

పాక్-చైనా ఎక్స్‌చేంజ్..

వీరు సేకరించిన సమాచారం పాకిస్తాన్ ద్వారా చైనాకు వెళ్తుందని తెలిసింది, అరుణాచల్‌లో 38 విమాన యానా ప్రాజెక్టులు లక్ష్యం. చాంగ్‌లాంగ్‌లో గులామ్ అహ్మద్ మీర్, గౌహతిలో మాజీ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది కుల్దీప్ శర్మ, మిసామారీ వ్యూహకర్తలు, 2019 అరెస్ట్ నిర్మల్ రాయ్ (మాజీ ఆర్మీ, దుబాయ్ లింక్) గుర్తించబడ్డారు. అల్‌ఫలా యూనివర్సిటీ కేసు తర్వాత ఈ అరెస్టులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఈ ఘటనలు ఇన్‌లైన్ పర్మిట్ల పరిశీలన, డ్రోన్ నిఘా, స్థానికుల సహకారాన్ని బలోపేతం చేయాలని హెచ్చరిస్తున్నాయి. పోలీసు చురుకుదనం నెట్‌వర్క్‌ను క్షీణింపజేసింది. చిన్న వ్యాపారి మాస్క్‌లో దాగిన అగ్రాసం భారత సరిహద్దుల హెచ్చరిక, టెక్నాలజీ బేస్డ్ రక్షణ అవసరం.

# ఉత్తర భారతం ఉక్కిరిబిక్కిరి



న్యూఢిల్లీ,శీతాకాలం వచ్చిందంటే ఉత్తరభారతం ఊపిరి సలపలేక ఉక్కిరిబిక్కిరి అవుతుండడం ఏటా పరిపాటి అవుతోంది. దీనికి ప్రధాన కారణం వాయు కాలుష్యం. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడుతున్నాయి. దీనికి తోడు పొగమంచు దట్టంగా వ్యాపించడంతో కళ్లకు దారి కనిపించక అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్తరభారతంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు సంభవించి 25 మంది మృతి చెందడం అత్యంత శోచనీయం. పొగమంచు వల్లనే విమాన సర్వీస్‌లు ఆగిపోవడం లేదా ఆలస్యం కావడం జరుగుతోంది. సోమవారం ఉత్తరభారతంలో మొత్తం 300 విమాన సర్వీసులు రద్దు కాగా, మంగళవారం ఢిల్లీ విమానాశ్రయంలో 131 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇక దేశ రాజధాని ఢిల్లీ శీతాకాలంలో గ్యాస్ ఛాంబర్‌గా మారిపోతోంది. వృద్ధులు, పిల్లలు అస్వస్థులవుతున్నారు. ఎక్కడా లేని అనారోగ్యం ఢిల్లీలో కనిపిస్తోంది. వైద్య చికిత్స కావాలంటే ఢిల్లీ నగరాన్ని విడిచిపెట్టి మరెక్కడికైనా వెళ్లిపోండని వైద్యులు సిఫార్సు చేస్తున్నారంటే ఇది ఢిల్లీ పాలనపై హేయమైన ఆరోపణగానే భావించాలి. గాలిలో కాలుష్యానికి కారణమయ్యే వివిధ రకాల వాయువులు, రసాయనాల మిశ్రమాన్ని ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎంపి)గా పేర్కొంటారు. దేశంలో సగటున క్యూబిక్ సెంటీమీటర్‌కు ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎంపి) 2.5 మైక్రోగ్రామ్స్ గాను, గాఢత 54.4 మైక్రోగ్రామ్ గాను సాగుతోంది. కానీ సోమవారం ఢిల్లీలో సరాసరి వాయు నాణ్యత 427 వరకు సూచించగా, మంగళవారం నాటికి 381 వరకు తగ్గి కొంత మెరుగు కనిపించింది. అయినా ఇంకా 'వెరీ పూర్' కేటగిరిలోనే ఢిల్లీ వాయు నాణ్యత కొనసాగుతుండడం గమనార్హం. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గాలి నేలను తాకి కాలుష్యాలను వెదజల్లుతోంది. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, రసాయన వాయువులు, పంట వ్యర్థాల దహనాలు, నిర్మాణాల దుమ్ముధూళి ఇవన్నీ ఏటా ఢిల్లీని శీతాకాలంలో నివసించలేని నగరంగా మారుస్తున్నాయి. దీనికి పరిష్కారం అసాధ్యమేమీ కాదు. పాలక వర్గాలు కొన్ని చర్యలు తీసుకుంటే ఈ కాలుష్య భూతాన్ని అరికట్టవచ్చు. ఈ నేపథ్యంలో చైనా రాయబార కార్యాలయం ఢిల్లీకి కాలుష్య నివారణ మార్గదర్శకాలను దశల వారీగా అందించడానికి సంసిద్ధమైంది. చైనా రాజధాని బీజింగ్ ఒకప్పుడు 'ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని'గా రికార్డుకెక్కినప్పటికీ దశాబ్ద కాలం లోనే ఆ అపఖ్యాతి నుంచి బయటపడగలిగింది. చైనా, భారత్ ఈ రెండు దేశాలు కాలుష్యంతోపాటు విపరీత నగరీకరణతో పోరాడుతున్నాయని చైనా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి యు జింగ్ పేర్కొనడం గమనార్హం. స్వచ్ఛమైన గాలిని పొందడం రాత్రికి రాత్రి సాధ్యం కాదు. కానీ దశలవారీగా తగిన నియంత్రణ చర్యలు చేపడితే సత్ఫలితాలు లభిస్తాయి. ఈ మేరకు జింగ్ కొన్ని సూచనలు చేశారు. యూరో 6 నిబంధనల ప్రకారం బిఎస్ 6 ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. అత్యధిక కర్బన ఉద్గారాలను వెదజల్లే పాత వాహనాలను దశల వారీగా తొలగించడం, వాహనాల పెరుగుదలను నియంత్రించడం, వాహనాల నంబర్ ప్లేట్ చివరి అంకె ఆధారంగా సరిసంఖ్య, బేసిసంఖ్య చూసి వారం లోని నిర్దిష్ట రోజుల్లో మాత్రమే వాటిని నడపడానికి అనుమతించడం, ప్రమాణాల ప్రకారం బస్సుల నిర్మాణం జరిగేలా చూడడం ఇవన్నీ తక్షణ అవసరాలని ఆమె సూచించారు. సంప్రదాయ ఇంధనం వాహనాలకు వినియోగించకుండా మెథేన్, సిఎన్‌జి, హైడ్రోజన్ వంటి హరిత ఇంధనం వినియోగించాలన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను నగరానికి దూరంగా తరలించాలి. ఖాళీ అయిన ఫ్యాక్టరీలను పార్కులుగా, వాణిజ్య జోన్లుగా, సాంస్కృతిక, సాంకేతిక హబ్‌లుగా తీర్చి దిద్దాలి. దీనికి ఉదాహరణగా చైనాలో షౌగాంగ్ అనే పరిశ్రమల కాంప్లెక్సును 2022 నాటి శీతాకాల ఒలింపిక్ క్రీడోత్సవాల ప్రాంగణంగా వినియోగించారు. బీజింగ్‌లో జనం రద్దీని తగ్గించడానికి హోల్‌సేల్ మార్కెట్లను, లాజిస్టిక్ హబ్స్‌ను, కొన్ని విద్య, వైద్య సంస్థలను నగరానికి దగ్గరగా వేరే చోటకు తరలించారు. బీజింగ్ నుంచి సాధారణ ఉత్పత్తి, తయారీ సంస్థలను హెబెయి ప్రావిన్స్‌కు తరలించినప్పటికీ, అత్యున్నత పరిశోధన, అభివృద్ధి, సేవా రంగాలను బీజింగ్ పొందగలిగింది. 2013 లో చైనా కాలుష్య నివారణకు ఐదేళ్ల జాతీయ కార్యాచరణ ప్రణాళిను అమలు చేయడం ప్రారంభించింది. బీజింగ్‌లో బొగ్గుతో మండే బాయిలర్‌లను మూసి వేయించింది. ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించింది. హరిత ఇంధనం వాహనాలను పరుగెత్తించింది. పెట్రోలు, డీజిల్ వంటి కర్బన ఉద్గారాలను వెదజల్లే ఇంధనానికి స్వస్తి పలికింది. కొన్నేళ్ల పాటు కఠినంగా వీటిని అమలులోకి తేవడంతో విజయం సాధించింది. ఇప్పుడు చైనా దౌత్య కార్యాలయం ఈ చర్యలను సూచించడం ఢిల్లీ స్వాగతించవలసిందే.

# ప్రసంగాలు అర్థవంతం.. పనితీరు ప్రశంసనీయం



న్యూఢిల్లీ,పార్లమెంట్‌లో తన పనితీరుతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా దాదాపు అన్ని రాజకీయ పక్షాల నుండి అభినందనలు అందుకుంటున్నారు. సోదరుడు రాహుల్ గాంధీ కన్నా ఆమె పరిణితితో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం పలువురిలో కలుగుతుంది. మరోవంక రాహుల్ గాంధీ నాయకత్వం పనితీరు పట్ల సొంత పార్టీ నేతల నుండే విముఖత వ్యక్తం అవుతున్నది. ఈ పరిణామాలు రాహుల్ గాంధీలో అసహనాన్ని పెంచుతుందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హిందీలో ఆమె ప్రసంగాలు అర్థవంతంగా ఉంటున్నాయని, ప్రభుత్వ విధానాలపై సున్నితంగా విమర్శలు చేస్తూనే బాధ్యతాయుతంగా మాట్లాడుతున్నారని, పైగా నిర్మాణాత్మక సూచనలు కూడా చేస్తున్నారనే అభిప్రాయం కలుగుతుంది. ఆమె ఏ అంశంపై ప్రసంగం చేసినా ముందుగా తగు విధంగా తయారై, నోట్స్ పట్టుకొని అందరినీ ఆకట్టుకొనే విధంగా మాట్లాడుతున్నారని అభిప్రాయం కలుగుతుంది. పైగా, ఆమె తన వయనాడ్ నియోజకవర్గానికి కేంద్రం సహాయం కోరుతూ అమిత్ షా, జెపి నడ్డా వంటి సీనియర్ కేంద్ర మంత్రులను కలవడం, హోం వ్యవహారాల పార్లమెంటరీ కమిటీలో చురుకైన సభ్యురాలుగా వ్యవహరించడం గమనిస్తుంటే రాహుల్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్నారని స్పష్టం అవుతుంది. పైగా, సమావేశాలలో పార్టీలకు అతీతంగా తోటి ఎంపిలతో స్నేహపూర్వకంగా సంబంధాలను ఏర్పరచుకుంటున్నారు. అందుకు పూర్తి విరుద్ధంగా, రాహుల్ సాధారణంగా అధికార పార్టీ నేతలపట్ల కఠినంగా, దూరంగా ఉంటారు. రాష్ట్రాల నుండి సొంత పార్టీ నేతలకు సైతం ఆయన అందుబాటులో ఉండటం లేదు. ఆయనను కలవాలంటే ఆయనకు సన్నిహితులైన కొందరు నాయకులను ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. రాహుల్ లేవనెత్తే అంశాలపై ప్రభుత్వం నుండి తీవ్రమైన దాడులు ఎదురు కావడమే కాకుండా ఇండియా కూటమి పక్షాల నేతల నుండి కూడా సంఘీభావం ఎదురు కావడం లేదు. చివరకు సొంత పార్టీ నేతలు సైతం పట్టించుకోవడం లేదు. అదానీ, -అంబానీ గుత్తాధిపత్యం లేదా 'ఓటు చోరీ' గురించి ఆయన పల్లవి అయినా, ఆయన సమస్యల ఎంపిక అయినా గందరగోళంగా ఉంటుందని, లోతుగా పరిశోధన చేస్తున్నట్లు ఉండటం లేదని, అప్రయత్నంగా ప్రభుత్వంపై పరుషంగా చేస్తున్న పలు విమర్శలు కాంగ్రెస్ పార్టీనే ఆత్మరక్షణలో పడవేస్తున్నవని పలువురు సొంత పార్టీ నేతలే వాపోతున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత, ట్రంప్ కారణంగా భారతదేశం లొంగిపోయిందని రాహుల్ ప్రధాని నరేంద్ర మోడీని ఎగతాళి చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'చనిపోయినట్లు' అమెరికా అధ్యక్షుడు చేసిన వర్ణనను ఆమోదిస్తూ విమర్శలు గుమ్మరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీని ఎగతాళి చేసే హడావుడిలో జాతీయవాద భావాలను కించపరుస్తున్నామనే అంశాన్ని రాహుల్ మర్చిపోయారని కాంగ్రెస్ వర్గాల నుండే అసంతృప్తి వ్యక్తం అవుతుంది. మరోవైపు, ఆపరేషన్ సిందూర్‌పై తన పార్లమెంటు ప్రసంగంలో ప్రియాంక సంయమనంతో, ఉగ్రవాదులు బైసరన్ లోయలోకి ప్రవేశించడానికి అనుమతించిన భద్రతా లోపాలకు ఎవరైనా జవాబుదారీగా ఉండాలని అంటూ సంబంధిత అంశాన్ని లేవనెత్తారు. ప్రభుత్వాన్ని సున్నితంగా విమర్శిస్తూనే దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా ఆమె జాగ్రత్త పడుతున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావాలన్న నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రతిపాదనపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదన వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని అంటూ సున్నితంగా ప్రశ్నించారు. పైగా, పేరు మార్చడం వల్ల కొత్తగా స్టేషనరీ, బోర్డుల ముద్రణకు అదనపు ఖర్చు తప్ప ప్రయోజనం ఏముంటుందని ఎద్దేవా చేశారు. రాహుల్ నాయకత్వంపై పెరుగుతున్న అసంతృప్తి కారణంగా సాధారణంగా సౌమ్యులైన కాంగ్రెస్ సీనియర్ నేతలలో సైతం అసహనాన్ని కలిగిస్తున్నది. ఇప్పటికే ఆమెను చూస్తుంటే ఇందిరా గాంధీ గుర్తు వస్తుందని అనుకుంటున్న కాంగ్రెస్ యువ నేతలకు ప్రియాంక గాంధీలో మరో అవకాశం కనిపిస్తోంది. రాహుల్ నిశితంగా తరచూ విమర్శలు కురిపించే బిలియనీర్ గౌతమ్ అదానీతో బహిరంగంగా సహవాసం చేస్తున్నట్లు కనిపించడానికి కూడా పలువురు కాంగ్రెస్ నేతలు వెనుకాడటం లేదు. భోపాల్‌లో జరిగిన అదానీ కంపెనీ డైరెక్టర్ వివాహానికి దిగ్విజయ్ సింగ్ హాజరు కాగా, సుశీల్ కుమార్ షిండే తన సొంత మనవరాలి వివాహంలో వివాదాస్పద పారిశ్రామికవేత్తతో కలిసి ఫోజులిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదానీలు, అంబానీలు ఇద్దరితోనూ ఒప్పందాల కోసం వెంటపడుతున్నారు. కాంగ్రెస్ మిత్ర పక్ష ఎంపిలైన సుప్రియా సులే, మహువా మొయిత్రా బిజెపి ఎంపి కంగనా రనౌత్‌తో కలిసి మాజీ కాంగ్రెస్ సభ్యుడు, బిజెపి ఎంపి నవీన్ జిందాల్ కుమార్తె వివాహంలో బాలీవుడ్ పాట 'దీవాంగి దీవాంగి'కి వేదికపై నృత్యం చేశారు. తాజాగా బీహార్‌లో ఇండియా కూటమి ఘోర వైఫల్యానికి రాహుల్ గాంధీ కారణం అంటూ ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే అయితే ఎన్నికల తర్వాత సోనియా గాంధీని కలిసి రాహుల్ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కొడుకును మందలించమని కోరినట్లు తెలుస్తోంది. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా కూడా రాహుల్, ఆయన చుట్టూ ఉన్న బృందం దుందుడుకు చర్యల కారణంగానే కాంగ్రెస్‌తో పాటు, మిత్రపక్షాలు నష్టపోయిన్నట్లు ఖర్గే స్పష్టం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ వంటి వారిని ఎంతో కష్టపడి 'ఇండియా కూటమి' లోకి తీసుకు వస్తే వెళ్లిపోయేటట్లు చేశారని కూడా వాపోతున్నారు. తాజాగా కాంగ్రెస్ లో జాతీయ స్థాయి నాయకత్వ సంక్షోభాన్ని ఎత్తిచూపినందుకు ఒడిశాలో పార్టీ సీనియర్ నేత మొహమ్మద్ మోకిమ్‌ను 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాల' కారణంగా పార్టీ నుండి బహిష్కరించారు. పార్టీ పునరుజ్జీవనం కోసం లోతైన నిర్మాణాత్మక, సంస్థాగత, సైద్ధాంతిక పునరుద్ధరణకు పిలుపు ఇవ్వడంతో పాటు ఖర్గే వంటి వృద్ధతర నేతలను పక్కన పెట్టి ప్రియాంకకు జాతీయ నాయకత్వం ఇవ్వాలని సూచిస్తూ నేరుగా సోనియా గాంధీకి లేఖరాయడం సహజంగానే పార్టీ నాయకత్వానికి ఆగ్రహం కలిగించింది. పార్టీ తనపై చర్య తీసుకుంటుందని తెలిసి కూడా మోకిమ్ ఉద్దేశపూర్వకంగానే ఆ విధమైన విమర్శలు చేశారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్పుడూ 'దారో మత్' అని అంటారు. పార్టీని ప్రభావితం చేసే సమస్యలను ఎత్తిచూపుతూ సోనియా గాంధీకి లేఖ రాయడానికి నేను ఆయన నినాదం నుండి ప్రేరణ పొందాను. పార్టీ దానిని అంగీకరించలేదు. నన్ను కాంగ్రెస్ నుండి బహిష్కరించింది. నేను ఇంకేమీ చెప్పలేను' అని మోకిమ్ తన బహిష్కరణ తర్వాత నిస్సహాయతను వ్యక్తం చేశారు. సోనియా గాంధీకి రాసిన తీవ్రమైన లేఖలో, మోకిమ్ తప్పుడు నాయకత్వ ఎంపికలు, అగ్ర నాయకత్వం- కార్యకర్తల మధ్య దూరం పెరగడం, యువతతో కనెక్ట్ కాలేకపోవడం కారణంగానే కాంగ్రెస్ వరుసగా దెబ్బలు తింటున్నట్టు వివరించారు. పలు రాష్ట్రాల్లో పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికల పరాజయాలపై, మోకిమ్ మాట్లాడుతూ 'లోతైన సంస్థాగత డిస్‌కనెక్ట్' ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మల్లికార్జున్ ఖర్గే (83) వయస్సును ఉదహరిస్తూ ఆయన నాయకత్వాన్ని మోకిమ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీని మూడు సంవత్సరాలుగా కలవడానికి తాను చేసిన విఫల ప్రయత్నాన్ని కూడా మోకిమ్ ఈ సందర్భంగా ఎత్తి చూపారు. అందుకు అడ్డుగా నిలబడుతున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తనకు ఇష్టమైన వారిని తప్ప దగ్గరకు రానీయడంలేదని విమర్శించారు. శశిథరూర్ వంటి నాయకులు దూరంగా ఉండడానికి సైతం వేణుగోపాల్ వంటి వారనే అభిప్రాయం బలపడుతుంది. అటువంటి నేతలతో రాహుల్ నేరుగా చర్చించే ప్రయత్నం చేయకపోవడం పార్టీ నాయకత్వంలో అగాథాన్ని పెంచుతుంది. రాహుల్ గాంధీని కలిసేందుకు సుదీర్ఘకాలం ప్రయత్నించి, విఫలమైన ప్రస్తుత అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మ కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌లు

విజయనగరం, ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో సామాన్య ప్రజల నుంచి వస్తున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. అధికార యంత్రాంగం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహించటం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి 124 అర్జీలు వచ్చాయన్నారు. రెవిన్యూ, విద్యుత్, పెన్షన్లు, ఉపాధి అవకాశాల గురించిన అర్జీలు ప్రజలు సమర్పించినట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వాటికి పరిష్కారం చూపాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు కార్యాలయ సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం ప్రదానం

న్యూఢిల్లీ,భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం. భారత్ - ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

## సెన్సార్ బోర్డుతో కేరళ సీఎం ఢీ..

కేరళ:భారతదేశంలో ఎన్ని రాష్ట్రాలున్నా కేరళ మాత్రం ప్రత్యేకం. 40 ఏళ్ల కిందటే అక్షరాస్యతలో ముందంజ.. ఒకసారి ఒక పార్టీకే అవకాశం (ఇటీవల మినహా), సామాజిక చైతన్యం ఇలా దేనిలోచూసినా కేరళను చూసి మిగతా రాష్ట్రాలు నేర్చుకోవాలి అన్నట్లుంటుంది పరిస్థితి. అంతేకాదు.. ప్రకృతికి పెట్టింపేరు కేరళ. అందుకే గాడ్స్ ఓన్ కంట్రీగానూ పేరు తెచ్చుకుంది. ఇక ఇటీవలి కాలంలో కేరళ సినిమాలు దేశవ్యాప్తంగా చర్చనీయం అవుతున్నాయి. వైవిధ్యానికి పెద్ద పీట వేసే కేరళ సినిమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. జాతీయ అవార్డులనూ కొల్లగొడుతున్నాయి. కేరళ నటులకు అన్ని రాష్ట్రాల సినీ పరిశ్రమల్లోనూ ప్రత్యేక స్థానం ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా సినీ ఇండస్ట్రీ ప్రాధాన్యతను గుర్తిస్తుంది. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారూ కేరళలో అధికమే. ఇప్పుడు అసలు విషయానికి వస్తే.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)పై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఆ బోర్డును సవాల్ చేస్తున్నారు.

పంచాయితీ మొదలు..

అసలే తాజాగా కేరళ రాజధాని తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జయకేతనం ఎగురవేసింది. కేరళను దశాబ్దాలుగా టార్గెట్ చేస్తున్న కమలం పార్టీ ఎంతకూ లక్ష్యాన్ని సాధించలేకపోతోంది. సీపీఎం, కాంగ్రెస్ వేర్వేరు కూటములుగా ఏర్పడి మిగతా పార్టీలను కలుపుకొని పోతుండడమే దీనికి కారణం. ఎన్ని అంశాలను టేకప్ చేసినా కేరళలలో బీజేపీ పెద్దగా ప్రయోజనం పొందలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయ పార్టీకి పెద్ద బూస్ట్. పరిస్థితి చూస్తూ ఉంటే తమకు భవిష్యత్ లో ముప్పు తప్పదని భావించారో ఏమో.. కేరళ సీఎం పినరయి విజయన్ కాలుదువ్వుతున్నారు. దీనికి సెన్సార్ బోర్డు అంశాన్ని ఎంచుకున్నారు.

సెన్సార్ బోర్డు డోంట్ కేర్..

సీబీఎఫ్‌సీ పర్మిషన్ ఇవ్వకపోతేనేం..? అలాంటి సినిమాలను కేరళ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో రిలీజ్ చేస్తామని సీఎం పినరయి విజయన్ ప్రకటించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని మండిపడ్డారు. ఈ నియంత ధోరణులను సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఫేస్ బుక్ లో పోస్ట్ పెట్టారు.

ఇదీ మూల కారణం..

సీబీఎఫ్‌సీ ఇటీవల 19 సినిమాలకు నో చెప్పింది. సెన్సార్ సంగతి ఏమో కానీ.. ఇలా నో చెప్పడం వివాదంగా మారుతోంది. దీన్నే విజయన్ ప్రశ్నిస్తున్నారు. ఈ సినిమాలను కేరళ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ లో రిలీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే, సీబీఎఫ్‌సీ వద్దన్న 19 సినిమాల్లో నాలుగు సినిమాలకు కేంద్ర సమాచార ప్రసార శాఖ అనుమతిచ్చింది. మిగతా 15 సినిమాలను ప్రదర్శనకు రెండు వారాల ముందు జాబితా ఇవ్వనందునే అనుమతి ఇవ్వలేకపోయినట్లు వివరించింది.

## జోగి బ్రదర్స్‌కు దక్కని ఊరట

అమరావతి,నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు ఊరట లభించలేదు. అద్దేపల్లి బ్రదర్స్, జోగి బ్రదర్స్ బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు.. బాదల్ దాస్ (ఎ7), ప్రదీప్ దాస్ ( ఎ8), కళ్యాణ్ ( ఎ12), రవి (ఎ4), శ్రీనివాస్ తిరుమలశెట్టి (ఎ13), శ్రీనివాస్ రెడ్డి (ఎ11), సతీష్ (ఎ17) లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి శ్రీరాములు, అద్దేపల్లి జనార్దన్ రావు (ఎ1)తోపాటు ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావు (ఎ2)తోపాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గురువారం విచారణ జరిపిన కోర్టు ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి.

# తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేత: ఈసీ




హైదరాబాద్ ,తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో ఈ నిర?యం తీసుకున్నారు. నూతన సర్పంచ్‌లు ఈ నెల 22న పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.తెలంగాణలో గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో అమలు చేసిన ఎన్నికల కోడ్ ను ఎత్తివేస్తున్నట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 5గంటల నుంచి ఎన్నికల కోడ్ ఎత్తివేస్తున్నట్లుగా తెలిపింది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఈసీ పేర్కొంది. ఎన్నికల విధుల్లో మరణించిన సిబ్బందికి పరిహారం చెల్లించాల్సి ఉందని, పరిహారం చెల్లింపుకు అవసరమైన చర్యలను జిల్లాల కలెక్టర్లు తీసుకోవాలని సూచించింది. కాగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు ఈ నెల 22న పదవీ స్వీకరణ చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది.గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సహా బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఉప ఎన్నికల నేపథ్యంలో విధించిన ఎన్నికల కోడ్ ను నవంబర్ 16న కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. ఆ తర్వాత కొద్ది రోజులకే తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల సందరరేగా మరోసారి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికలు ముగిసిన తర్వాత మోడల్ కోడ్ ను ఎత్తివేస్తున్నట్లుగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

వరుస ఎన్నికలు..అభివృద్ధికి కోడ్ బ్రేక్ లు

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్లమెంటు ఎన్నికలు, అదే సమయంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక, అనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ(మహబూబ్ నగర్, హైదరాబాద్) ఎన్నికలు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, అనంతరం కరీంనగర్–మెదక్ –నిజామాబాద్–ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అలాగే నల్గొండ–వరంగల్–ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు, అలాగే కరీంనగర్– మెదక్– నిజామాబాద్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటు నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఆ తర్వాత ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా వచ్చాచి. ఇదే క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, గ్రామ పంచాయతీ ఉప ఎన్నికలు కూడా జరిగిపోయాయి. ఇలా వరుస ఎన్నికల ప్రక్రియ కారణంగా పలుమార్లు తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న పరిణామం అభివృద్ధి పనుల అమలుకు బ్రేక్ లా మారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు ముందున్న నేపథ్యంలో మరోసారి రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రానుండటం గమనార్హం.

# రేవంత్ స్థానం సుస్థిరం.. ప్రతిపక్షంలో ఎవరెక్కడ?



హైదరాబాద్,తెలంగాణలో పంచాయతీ సమరం ముగిసింది. తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ అంచనాలకు మించి విజయం సాధించింది. గత నెలలో జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అనూహ్యంగా గెలిచిన కాంగ్రెస్ కు పంచయతీ ఎన్నికల ఫలితాలు మరింత జోష్ ఇచ్చాయంటున్నారు. ఈ జోరు కొనసాగించాలనే ఉద్దేశంతో వచ్చే నెలలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెబుతున్నారు. ఇక తాజా ఎన్నికల సీజన్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా మరింత బలపడ్డారనే విశ్లేషణలు వస్తున్నాయి. తాజా ఫలితాల తర్వాత సీఎం రేవంత్ ను ఢీకొట్టే సమఉజ్జీలు ప్రతిపక్షాల్లో ఎవరు ఉన్నారు? అన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆ తర్వాత జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసిందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని భావిస్తే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, ఇప్పుడు పంచాయతీ పోరులోనూ బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేకపోయిందనే అంటున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యేనే కొనసాగే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ఇక రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించి, సీఎం పీఠం దక్కించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నెలల్లో అందుకున్న విజయాలతో రాష్ట్రంలో తిరుగులేని రాజకీయ శక్తిగా ఆవిర్భవించారని అంటున్నారు.రెండేళ్ల క్రితం సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ఎన్నికల ముందు వరకు అనేక సందేహాలకు కేంద్ర బిందువుగా ఉండేవారు. ఆయన పనితీరు విషయంలో కాంగ్రెస్ నేతలు నమ్మకం కోల్పోయారని, కాంగ్రెస్ అధిష్టానం సైతం సీఎంను పట్టించుకోవడం లేదని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కొన్ని సర్వేసంస్థలు సైతం కాంగ్రెస్ సర్కారుపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని నివేదికలు విడుదల చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రతిపక్షాలు ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉందని కూడా ప్రకటనలిచ్చాయి. అయితే తాజా పంచాయతీ ఎన్నికల ఫలితాలతో అవన్నీ ఉట్టి అబద్ధాలే అని తేలిపోయాయంటున్నారు.ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామర్థ్యాన్ని ప్రశ్నిస్తూ ఇన్నాళ్లు మాట్లాడిన వారి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లైందని విశ్లేషిస్తున్నారు. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేలా రాజకీయం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అంతే వ్యూహంతో పంచాయతీల్లో మూడు రంగుల జెండాను నమ్ముకున్న వారిని గెలిపించేలా మంత్రులు, ఎమ్మెల్యేలను నడిపించారని అంటున్నారు. విపక్ష పార్టీలు అయిన బీఆర్ఎస్, బీజేపీల్లో ఏ నేత కూడా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలకు దీటుగా పనిచేయలేకపోవడమే ఇప్పుడు హాట్ డిబేట్ గా మారుతోందని అంటున్నా రు.ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డిని ఎదుర్కొని రాజకీయం చేసే నాయకులు విపక్షంలో ఎవరున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డితో సమానంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ను చెబుతుంటారు. తెలంగాణలో అందరి కంటే మాజీ సీఎం కేసీఆర్ ఇమేజ్ పైనే ఎక్కువ ఫోకస్ ఉంటుంది. తెలంగాణ జాతిపితగా ఆయన సాధించిన గుర్తింపు వల్ల ఇది సాధ్యమైందని అంటున్నారు. అయితే కేసీఆర్ స్థాయి నేతను ఢీకొట్టి, ఓడించి రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. దీంతో రేవంత్ ఇమేజ్ దేశవ్యాప్తంగా పెరిగిందని అంటున్నారు. ఇప్పుడు ఆయన వ్యూహాలను ఎదుర్కొనేలా కేసీఆర్ కూడా ఏం చేయలేకపోతున్నారని విశ్లేషిస్తున్నారు. రాజకీయ వ్యూహరచనలో దిట్టగా ప్రచారం ఉన్న మాజీ సీఎం కేసీఆర్ రెండేళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి విషయంలో పైచేయి సాధించలేకపోతున్నారు.అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తన ఫాం హౌస్ కి మకాం మార్చిన మాజీ సీఎం కేసీఆర్.. ఎప్పుడో కానీ రాష్ట్ర రాజకీయాలపై స్పందించడంలేదు. పార్టీ క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న సమయంలోనూ ఆయన మౌనంగానే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం రేవంత్ వ్యూహాలను ఎదుర్కోలేకపోతున్నారని టాక్ వినిపిస్తోంది. దీనికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోపాటు పంచాయతీ ఎన్నికల ఫలితాలనే ఉదహరిస్తున్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టేలా పనిచేసిన బీజేపీ కూడా ఇప్పుడు మునుపటి జోరు చూపలేకపోతోందని అంటున్నారు. రాష్ట్రంలోని బీజేపీ ముఖ్యనేతలైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉండటంతో రాష్ట్రంలో విపక్షపాత్ర పోషించలేకపోతున్నారని అంటున్నారు. దీంతో తెలంగాణలో ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డికి తగిన సమ ఉజ్జీ కనిపించడం లేదన్న టాక్ వినిపిస్తోంది.

# జనసేన పంచ వ్యూహం...గురి తప్పదంతే !



న్యూఢిల్లీ,కురుక్షేత్ర యుద్ధంతో పద్మవ్యూహం ఎంతలా పాపులర్ అయిందో అందరికీ తెలుసు. అలాగే రాజకీయ కురుక్షేత్రంలో ఎన్నో వ్యూహాలు ఎత్తులు వేయాల్సి ఉంటుంది. జనసేన ఏపీ రాజకీయాలో ప్రధాన రాజకీయ పక్షంగా ఉంది. వీలు చూసుకుని తమ స్థాయిని పెంచుకుని మరింతగా పటిష్టం కావాలని చూస్తోంది. దాంతో ఆ పార్టీ ఇపుడు పూర్తిగా సంస్థాగతమైన వ్యవహారాల మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది అని వార్తలు వస్తున్నాయి. ఒకనాడు జనసేన మీద ఏదైతే ఆరోపణలు విమర్శలు ఉన్నాయో వాటి అన్నింటికీ చెక్ పెడుతూ జనసేన తనదైన వ్యూహంతో గురి తప్పకుండా దూసుకుని పోవాలని చూస్తోంది అంటున్నారు

పిఠాపురంలో ప్లాన్ :

పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా ఉంటూ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ఎక్కువ సమయం అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉంటారు. కాబట్టి తనకు బదులుగా ప్రభుత్వ పార్టీ వ్యవహారాలను చూసేందుకు ఇంచార్జి నేతలను నియమించుకున్నారు. అయితే ఒకరికే అవకాశం ఇస్తే మిగిలిన వారిలో అసంతృప్తి చెలరేగి అది వేరే విధంగా సంకేతాలు ఇస్తోంది. దాంతో సమిష్టి బాధ్యతగా ఫైవ్ మెన్ కమిటీని అక్కడ ఆయన నియమించి పార్టీని సక్సెస్ ఫుల్ గా నడిపిస్తున్నారు. ఈ కమిటీలో సీనియర్లు పనిచేసిన వారు అంతా ఉన్నారు. దాంతో వీరంతా కో ఆర్డినేషన్ తో పనిచేస్తున్నారు.

ఈసారి రెట్టింపు :

ఇక జనసేన అనేక రకాలైన కారణాల వల్ల 2024 ఎన్నికల్లో 21 సీట్లకే పరిమితం అయింది. అయితే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో సీట్లు గెలుచుకుని కూటమిలో టీడీపీ తరువాత రెండవ బలమైన మిత్రపక్షంగా ఉంది. ఇక 2029 నాటికి ఈ సీట్ల సంఖ్యను రెట్టింపు చేసుకోవాలని చూస్తోంది. అంటే 42 అన్న మాట. మరి సీట్లు కొత్తవి డిమాండ్ చేయాలి అంటే సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. అందుకే జనసేన తన పార్టీని మొత్తం 175 అసెంబ్లీ సీట్లలో పటిష్టం చేసే పనిలో ఉంది అని అంటున్నారు.

క్షేత్ర స్థాయిలో :

జనసేన తన పార్టీని బలోపేతం చేసుకోవడం లేదని విమర్శలు ఇంతకాలం వినిపించాయి. ఇపుడు అలాంటి చాన్స్ లేకుండా జనసేన ముందుకు సాగాలని చూస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న కమిటీలను మొత్తంగా రద్దు చేసింది. వాటి స్థానంలో తొందరలో కొత్తగా గ్రామ వార్డు నుంచి గ్రామం మండలం, నియోజకవర్గం జిల్లా ఇలా అన్ని చోట్లా పటిష్టం చేసుకునేందుకు ఫైవ్ మెన్ కమిటీలను ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ ఫైవ్ మెన్ కమిటీలలో పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న వారితో పాటు సీనియర్లు సామాజిక వర్గం రాజకీయ కోణంలో చూసుకుంటూ సమర్థులు అయిన వారికి చోటు ఇవ్వాలని చూస్తున్నారు.

సమిష్టి నిర్ణయాలు :

ఈ విధంగా ప్రతీ చోటా ఇంచార్జిని పెట్టి ఫైవ్ మెన్ కమిటీతో సమిష్టి నిర్ణయాలు తీసుకునేలా చేయడం ద్వారా పార్టీ నిర్మాణాన్ని కొత్త పుంతలు తొక్కించాలని జనసేన ఆలోచిస్తోంది. దీని వల్ల అందరికీ అవకాశాలు వస్తాయని అదే సమయంలో పార్టీ ఎటూ అధికారంలో ఉంది కాబట్టి మరింతగా పుంజుకుని గ్రాస్ రూట్ లెవెల్ నుంచి ఎదిగేందుకు వీలు ఉంటుందని భావిస్తున్నారు. స్థానిక ఎన్నికలకు కూడా ఈ ప్రయోగం బాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. సో జనసేన రెడీ అన్న మాట.

# బెంగాల్ గెలిస్తే ఎన్డీయేలో కొత్త లెక్కలు !



న్యూఢిల్లీ,బీజేపీ హాట్ ఫేవరేట్ స్టేట్ గా పశ్చిమ బెంగాల్ ఉంది. ఆ పార్టీ 2021లో బెంగాల్ ని చేజిక్కించుకునేందుకు చేసిన భారీ ప్లాన్స్ అంతా చూశారు. అయినా సరే ఓడి గెలిచింది. ఏకంగా 75 సీట్లకు తక్కువ కాకుండా దక్కించుకుని ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఆనాడు చేసిన కృషి ఇపుడు బాగా వర్కౌట్ అయ్యేలా కనిపిస్తోంది. గతంలో జరిగిన పొరపాట్లు ఏమిటి అన్నది సమీక్షించుకోవడమే కాకుండా కొత్త వ్యూహాలతో రంగంలోకి దిగుతోంది.

సర్ తో భారీ చెక్ :

ప్రత్యేక ఓట్ల సవరణ సర్ పేరు తో కేంద్ర ఎన్నికల సంఘం వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న ప్రక్రియకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తోంది. అఫ్ కోర్స్ ప్రతిపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయనుకోండి. అయితే దీని వల్ల నకిలీ ఓట్లు పోతాయని బీజేపీ అంటోంది. అదే సమయంలో ఆ ఓట్లతోనే విపక్షాలు గెలుస్తున్నాయని కూడా బీజేపీ ఆరోపిస్తోంది. దీంతో బీహార్ లో అయితే ఏకంగా 65 లక్షలకు పైగా ఓట్లను సర్ ప్రక్రియలో భాగంగా తొలగించారు. వీరంతా అక్రమ వలసదారులు చనిపోయిన వారు అని చెప్పుకొచ్చారు. ఇపుడు చూస్తే బెంగాల్ లో ఈ ప్రక్రియ దూకుడుగా సాగుతోంది. మమత సొంత నియోజకవర్గంలో కూడా ఏకంగా నలభై వేల ఓట్లు సర్ పేరుతో తొలగించారు అని అంటున్నారు. ఇది ఆ తృణమూల్ కాంగ్రెస్ కి భారీ దెబ్బగానే చూస్తున్నారు.

బీజేపీని పట్టుకోవడం కష్టమే :

ఇక చూస్తే కనుక 2026 మే నేలలో బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అంటున్నారు. ఆ ఎన్నికల్లో ఆరు నూరు అయినా గెలిచి తీరాలని బీజేపీ కంకణం కట్టుకుంది. దాంతో బీజేపీ పట్టుదలగా పనిచేస్తోంది. అక్కడ కనుక బీజేపీ గెలిస్తే ఎన్ డీయేలో కూడా కొత్త లెక్కలు మొదలవుతాయని అంటున్నారు. ఇప్పటికే బీహార్ లో మరోసారి ఎన్డీయే గెలిచింది. నితీష్ కుమార్ ని ముఖ్యమంత్రిగా చేసినా మొత్తం పెత్తనం అంతా బీజేపీదే అన్నట్లుగా అక్కడ ఉంది. అదే సమయంలో జేడీయూకి చెందిన 12 మంది లోక్ సభ అలాగే రాజ్యసభ ఎంపీలు అంతా పూర్తిస్థాయిలో ఏకపక్షంగా బీజేపీకి మద్దతు ప్రకటించడానికి సిద్ధం అయిపోయాయి.

ఊతకర్రలు ఉత్త కర్రలు :

ఇక కేంద్రంలో మూడవసారి ఎన్డీయే ఎలా అధికారంలోకి వచ్చిందో అందరికీ తెలిసిందే ఏపీలో టీడీపీ బీహార్ లో నితీష్ కుమార్ ల మద్దతు అతి ముఖ్యమైనదిగా ఉంది. ఈ ఇద్దరు నాయకులు లేకపోతే మోడీ హ్యాట్రిక్ ప్రధాని అన్నది మాత్రం కష్టమే అని చెప్పాల్సి ఉంది. ఇక 2026లో పశ్చిమ బెంగాల్ లో బీజేపీ గెలిస్తే ఈ ఇద్దరు మిత్రుల ప్రాధాన్యత కంటే బీజేపీ సౌండ్ ఎన్డీయేలో ఎక్కువగా ఉంటుంది అని అంటున్నారు. బీజేపీ అజేయంగా మారుతుందని చెబుతున్నారు. దాంతో మరిన్ని కొత్త నిర్ణయాలు సంచలన నిర్ణయాలు తీసుకోవడానికి బీజేపీకి అవకాశాలు అధికం అవుతాయని చెబుతున్నారు. అదే విధంగా బీజేపీని ఇక మీదట ఎవరూ శాసించలేని స్థితిలోకి వెళ్తుందని కూడా అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# తెలంగాణలో టీడీపీ స్కోరు ఎంతో తెలుసా..? పసుపుదళం మెరుపులు



హైదరాబాద్,తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మెరుపులు చర్చనీయాంశంగా మారాయి. తొలివిడత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 పంచాయతీలను పసుపు సైనికులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారని గతంలో వార్తలు రాగా, రెండు మూడు విడతల్లో మరో 20 స్థానాలను టీడీపీ గెలుచుకున్నట్లు ఓ నివేదిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఒక స్థానం ఏకగ్రీవంగా గెలుచుకోగా, మిగిలిన 19 స్థానాలను గట్టిపోటీతో గెలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని పంచాయతీల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులకు రికార్డు స్థాయి మెజార్టీ రావడంపైనా ఆసక్తికర చర్చ జరుగుతోంది.తెలంగాణలో టీడీపీ ఉనికే లేదని ఇన్నాళ్లు భావించిన ప్రధాన పార్టీలు తాజా ఫలితాల తర్వాత తమ అభిప్రాయాన్ని సవరించుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనే టీడీపీ కేడర్ మద్దతు కోసం అధికార కాంగ్రెస్, విపక్షం బీఆర్ఎస్ పోటీపడినప్పుడే పసుపుదళంపై విస్తృత చర్చ జరగింది. పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సర్పంచ్ పదవులను టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోవడం చూస్తే తెలంగాణలో ఆ పార్టీ పునాదులు ఇంకా బలంగానే ఉన్నాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం అవుతోంది.ప్రస్తుతం టీడీపీ గెలుచుకున్న స్థానాలు తెలంగాణలో పార్టీ భవిష్యత్తుపై సరికొత్త ఆశలను చిగురించేలా చేస్తున్నాయని అంటున్నారు. వాస్తవానికి దాదాపు 12 వేల పంచాయతీల్లో టీడీపీ గెలుచుకున్న స్థానాలు ఏమాత్రం పరిగణనలోకి తీసుకునే సంఖ్య కానప్పటికీ, ఆ పార్టీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ ఫలితాలు గొప్పగానే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో టీడీపీ చరిత్ర ఒకప్పటి వైభోగంగానే చర్చించుకుంటున్న సమయంలో పార్టీ హైకమాండ్ నుంచి ఎలాంటి సహకారం లేకుండానే కేడర్ పోరాడి పార్టీని బతికించుకునే ప్రయత్నం చేయడమే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.ఇక టీడీపీ మద్దతుతో గెలిచిన అభ్యర్థుల్లో కొందరు కొందరు వెయ్యికి పైగా ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. ఇలా గెలిచిన వారికి పార్టీ సభ్యత్వంలో ఉందని చెబుతూ, సభ్యత్వం కార్డు నెంబరుతో కూడిన ఓ జాబితాను తయారుచేసి వైరల్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని వైరా నియోజకవర్గంలో వెలనాటి సునీత అనే మహిళ నాయకురాలు ఏకంగా 1258 ఓట్లతో గెలుచుకోవడం ఆసక్తికరంగా వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో చొప్పదండి నియోజకవర్గం గట్టు భూత్కురు పంచాయతీలో మల్యాపురం రాజేశ్వరి 900 ఓట్లతో సర్పంచ్ గా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఖమ్మం, నల్గొండ జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు 500 ఓట్లకు పై మెజార్టీతోనే సర్పంచులు అయ్యారు. వీరంతా పసుపు జెండాతోనే ఎన్నికల్లో పోటీ చేయడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు.వాస్తవానికి టీడీపీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ప్రాంతంలో ఆ పార్టీకి బలమైన కేడర్ ఉంది. ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్ ఉమ్మడి జిల్లాలతోపాటు హైదరబాద్ నగరం చుట్టుపక్కల విస్తరించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో టీడీపీ తిరుగులేని శక్తిగా రాజకీయం చేసేది. అయితే 2004లో ఓటమి తర్వాత తెలంగాణలో తెలుగుదేశం తిరిగి బలపడే పరిస్థితి లేకుండా పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ కూడా చేయలేదు. ఆ తర్వాత తెలంగాణలో టీడీపీ కార్యకలాపాలు కూడా పూర్తిగా తగ్గించేశారు. అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాద్ వచ్చినప్పుడు మాత్రమే తెలంగాణ కేడర్ కనిపిస్తుంది. ఇక ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో కూడా తెలంగాణ నేతలు పెద్దగా కనిపించిన పరిస్థితులు లేవంటున్నారు. కానీ, గ్రామస్థాయిలో జరిగిన ఎన్నికల్లో కేడర్ బలంగా పోరాడి స్వతంత్రంగా గెలవడమే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## విజయోత్సవాలకు అనుమతి లేదు

యాదాద్రి భువనగిరి,పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎవరూ వియోత్సవ ర్యాలీలు జరుపుకోవద్దని కలెక్టర్ హన్మంతరావు ముందే ఆదేశించారు. అన్ని దశల్లో ఎన్నికల ప్రశాంతంగా జరిగాయని అన్నారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాం. ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. విజేతలు విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు జరుపుకోవద్దు. నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. యాదాద్రి జిల్లాలో మూడో విడతలో 92.56 శాతం పోలింగ్ నవోదైంది. మొత్తం1,59,289 మంది ఓటర్లు ఉండగా, 1,47,432 ఓట్లు పోలయ్యా యి.

# నెక్ట్స్ లెవల్ లో ఏపీ టూరిజం..




అమరావతి,ఏపీలో టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. ప్రభుత్వం చేసే భూ కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యం టూరిజం ప్రాజెక్టులకే ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రానికి ప్రపంచస్థాయి టూరిజం ప్రాజెక్టుల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెబుతున్నారు. ఈ దిశలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రపంచ పర్యాటక రంగంలోని మంచి పేరున్న వండర్‌లా విశాఖలో అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అదేవిధంగా తిరుపతిలో ఇమాజికా వరల్డ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి టూరిజంపై ఎక్కువ దృష్టి పెట్టింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు సంపదను సృష్టించవచ్చని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే తరచూ పర్యాటక రంగంపై ఆయన సమీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే దేశంలోని అతిపెద్ద, అత్యంత ప్రజాదరణ పొందిన థీమ్ పార్క్ చైన్‌లలో ఒకటైన వండర్‌లాకు విశాఖపట్నంలో 50 ఎకరాల భూమి కేటాయించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రపంచ స్థాయి వినోద సదుపాయాలకు పేరుగాంచిన ఇమాజికా వరల్డ్ తిరుపతిలో 20 ఎకరాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని సంప్రదించిందని చెబుతున్నారు.ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రెండు ప్రాంతాల్లో టూరిజం మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతాయని, గణనీయమైన ఉద్యోగావకాశాలు సృష్టిస్తాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఈ రెండు సంస్థలు కోరిన భూములను ఇప్పటికే వేరే సంస్థలకు కేటాయించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో రెండు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుపై సందిగ్ధం ఏర్పడగా, ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యంతో పర్యాటక రంగానికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించి, ఆయా సంస్థలు కోరిన భూములను అప్పగించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్టులే కాకుండా రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాలలో టూరిజం శాఖ రూ.28,977 కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపడుతోందని ప్రభుత్వం చెబుతోంది. కొత్తగా రాష్ట్రంలో ఏర్పాటయ్యే ప్రాజెక్టుల వల్ల టూరిజం మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారు. ఇక పర్యాటక రంగంలో ఎక్కువగా విశాఖ, తిరుపతిలోనే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం ప్రతిపాదిత ప్రాజెక్టుల్లో విశాఖపట్నంలో రూ.11,092 కోట్ల విలువైన 66 ప్రతిపాదనలు ఉన్నాయి. అదేవిధంగా తిరుపతిలో రూ.5,321 కోట్ల విలువైన 27 ప్రతిపాదనలతో రెండో స్థానంలో నిలిచిందని చెబుతున్నారు. మూడోస్థానంలో రాజధాని అమరావతితో రూ.3,960 కోట్ల విలువైన ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com